క్లుప్తంగా

వినాయకుని దర్శించుకున్న శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్



అంజూరు శ్రీనివాసులుకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్

కాణిపాకం(యాదమరి) : కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ వాసు స్వాగతం పలికి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులతో ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రాఘవేంద్రరావు



రాహుకేతు పూజల్లో దర్శకుడు రాఘవేంద్రరావు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి, స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ యశ్వంత్

సత్యవేడు: తిరుపతిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కొల్లడం గ్రామానికి చెందిన శ్రీరాములురెడ్డికి వలంటీర్ ఆదివారం పింఛన్ అందజేశారు. జనవరి నెల పింఛన్ పంపిణీలో భాగంగా ఆయన తిరుపతిలోని ఒక ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వలంటీర్ యశ్వంత్ సమాచారం అందుకున్నాడు. సొంత ఖర్చులతో అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశారు వలంటీర్ సేవలను పలువురు అభినందించారు.

10 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

సత్యవేడు: ఆడుదాం-ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు ఈనెల 10న నుంచి ప్రారంభమవుతాయని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో, ఖోఖో బాలిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను నియోజవర్గస్థాయి క్రీడా పోటీలకు పంపుతామన్నారు. మండల పరిధిలో 170 జట్లు, 1,938 క్రీడాకారులు మండల స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

సీఐకు సన్మానం



సన్మానం అందుకున్న సీఐ శివకుమార్‌రెడ్డి

సత్యవేడు: నంద్యాలకు బదిలీ అయిన సందర్భంగా సీఐ ఎస్.శివకుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆదివారం రాత్రి స్థానిక మస్తాన్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పోలీసులు, సత్యవేడు, నాగలాపురం, వరద య్యపాళెం వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళా పోలీసులు, ఆటో యూనియన్, సురుటుపల్లె ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు పైగా సత్యవేడు పనిచేశానని, మూడు మండలాల పరిధిలోని సిబ్బంది, అఖిల పక్షనాయకులు బాగా సహరించారని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నాగలాపురం: మండలంలో ఎస్ఎస్ పురం వద్ద అక్రమంగా వాహనంలో ఆదివారం తరలిస్తున్న 1,200 కేజీల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణా నాయక్ తెలిపారు. నిందితులు నాగలాపురం ఈస్ట్ దళితవాడకు చెందిన ఆదిమూలం, నగరి కీళ్లపట్టు గ్రామానికి చెందిన బద్రిగా గుర్తించి, అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబయ్య తెలిపారు.

పండుగలా పింఛన్ కానుక

- లంచాలు లేవు, జన్మభూమి కమిటీలు లేవు
- అర్హులందరికీ అందించడమే ధ్యేయం
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌కు పాలాభిషేకం చేస్తున్న పవిత్రారెడ్డి, పింఛన్‌దారులు



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పెంచిన పింఛన్ల పంపిణీ పండుగాలా జరుగుతోంది.. గత ప్రభుత్వంలో మాదిరి 'లంచాలు లేవు.. జన్మభూమి కమిటీ లేవు.. రాజకీయ కక్షసాధింపు లేవు.. అర్హులందరికీ పింఛన్లు అందించడమే ధ్యేయం' అని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాలకు సంబంధించి పెరిగిన రూ.3వేలు వైఎస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అందజేశారు. శ్రీకాళహస్తి మండలానికి సంబంధించి 9,228 మంది లబ్ధిదారులకు రూ.2.49కోట్లు, ఏర్పేడు మండలానికి సంబంధించి 9,299 మంది మందికి రూ.2.59కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు ప్రజా సంకల్పయాత్రలో అవ్వతాతలు పడుతున్న కష్టాలను చూసి తాము అధికారంలోకి వస్తే పింఛన్‌ను దశల వారీగా రూ.3వేలు చేస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని తెలిపారు. అందులో భాగంగా సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రోజే రూ.2,250 పెంచుతూ తొలి సంతకం చేశారన్నారు. ఆ తరువాత వరుసగా పెంచుకుంటూ నేడు రూ.3వేలు చేశారని తెలిపారు. నాడు పింఛను తీసుకోవాలంటే లబ్ధిదారుడు మరణిస్తే కొత్త పెన్షన్ మంజూరు అయ్యేదన్నారు. కానీ నేడు అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి నేరుగా వారి గడప వద్దకే వలంటీర్ పెన్షన్ అందజేస్తున్నారని తెలిపారు. జగనన్న పేద ప్రజలకు మంచి చేస్తుంటే చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని అడ్డంకులు సృష్టిసూ సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబునాయుడు లిప్‌స్టిక్ లాంటి నేత అని, చెరిపేస్తే మాయమైపోయే రకమని కానీ జగనన్న చక్కటి చిరునవ్వుతో ఆంధ్రరాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు ఇస్తూ ప్రేమను పంచుతూ అందరి హృదయాల్లో శాశ్వత ముద్ర వేసుకుంటున్నారని తెలిపారు. పెత్తందారులందరూ టీడీపీ పక్కన ఉంటే పేద ప్రజలందరూ జగనన్న పక్కన ఉన్నారని, వారి ఆశీర్వాదాలు ఉన్నంత వరకు ఎవరు ఏమి చేయలేరని పేర్కొన్నారు. పేద ప్రజల సంతోషం కోసం అనునిత్యం శ్రమిస్తున్న జగనన్నకు అందరి ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.

సేవకుడిలా పని చేస్తున్నా

శ్రీకాళహస్తిలో తెలుగుదేశం టిక్కెట్ లేదని చెప్పడంతో ఆరు నెలలకు ముందుగానే హైదరాబాద్ నుంచి వచ్చిన నేత ఖర్జూర వ్యాపారం చేస్తూ శ్రీకాళహస్తి ప్రజలను అవాస్తవ ఆరోపణలతో పక్కదారి పట్టిస్తూ అబాసు పాలవుతున్నారని ఎమ్మెల్యే మధు ఆరోపించారు. శ్రీకాళహస్తిలో పేదప్రజలకు సెంటు స్థలం ఇస్తుంటే దాన్ని కూడా రాజకీయం చేసి వారి కడుపు కొడుతున్నారని పేర్కొన్నారు. ఎవరి జడుపులకు తాను భయపడనని, పేద ప్రజల కోసం దేనికైనా సిద్ధమన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తీర్చేందుకు సేవకుల్లా తాను, తన బిడ్డ పవిత్రమ్మ ఉన్నామని తెలిపారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌కు లబ్ధిదారులతో కలిసి బియ్యపు పవిత్రారెడ్డి పాలాభిషేకం చేశారు. లబ్ధిదారులు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బత్రి హేమభూషణరెడ్డి, కూనాటి రమణయ్యయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, బత్తిశెట్టి, వయ్యాల కృష్ణారెడ్డి, కందాటి ఈశ్వర్‌రెడ్డి, మధురెడ్డి, జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి, శ్రీకాళహస్తి, ఏర్పేడు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే అట్టడుగు వర్గాల సంక్షేమం



రేణిగుంట : పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: జగనన్న పాలనలో అట్టడుగువర్గాల ప్రజల సంక్షేమం జరిగిందని, ఎన్నికల మ్యానిఫెస్టోను 98శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిఅని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. రేణిగుంట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం పెంచిన రూ.3వేలు పింఛన్, కొత్తవారికి పింఛన్లను ఎమ్మెల్యే అందజేశారు. మండలంలో 9,250 మందికి రూ.2.70కోట్లు పింఛను రూపంలో పంపిణీ చేశారు. తొలుత వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి పవిత్రారెడ్డితో కలసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలనలో అవ్వ,తాతలు పంచాయతీ కార్యాలయాలు, పోస్టాఫీసుల వద్ద పింఛను కోసం పడిగాపులు కాసేవారని, జగనన్న పాలనలో తెల్లవారకముందే వలంటీర్ ఇంటికొచ్చి పింఛను మొత్తాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, జువ్వల దయాకర్‌రెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు జువ్వల ధనంజయరెడ్డి, వెంకటరమణారెడ్డి, ఆనందరావు, కన్నయ్య, రసూల్, హసన్ సాహెబ్, ఖదీర్, జాన్‌బాబు, నాగరాజు, మోహన్, షేక్ షాజహాన్, బావాజి, సాదిక్‌బాష తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరస్వామి సేవలో ఎమ్మెల్సీ



ఆలయ అభివృద్ధికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



రేణిగుంట: సరుకులు పంపిణీ చేస్తున్న సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు : మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం దర్శించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ చైర్మన్ నరసింహయాదవ్ అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అభివద్ధికి రూ. 5 వేల నగదును ఎమ్మెల్సీ అందజేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం. రత్నం రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎల్లప్ప రెడ్డి, గెరటారెడ్డి మురళి రెడ్డి, కేశవుల రెడ్డి, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్సీ భరోసా

ఏర్పేడు మండలంలోని వికృతమాల గ్రామానికి చెందిన ధర్మారెడ్డి (53) కుటుంబానికి ఆదివారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సాయం చేశారు. ఇటీవలే ధర్మారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్సీ ఆ గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబానికి ఏడాదికి సరిపడే 40 రకాల నిత్యావసర సరుకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

సిపాయి భరోసా పంపిణీ

రేణిగుంట: మండలంలోని కృష్ణాపురం పంచాయతీ ఎల్ఎస్ కండ్రిగలో డి.సుబ్రమణ్యంరెడ్డి కుటుంబానికి ఆదివారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నిత్యావసనర సరుకులను పంపిణీ చేశారు. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబ సభ్యులను పరామర్శించి 41 రకాల వస్తువుల సిపాయి భరోసా కిట్‌ను అందజేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నారాయణవనం: మండలంలో సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటించనున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 10 గంటలకు మండలంలోని అరణ్యంకండ్రిగ సచివాలయ నూతన భవనాన్ని ఆయన ప్రారంభిస్తారని, అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు : మండల తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం అభిషేకాలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, ఈవో నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

దుప్పట్ల వితరణ



శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం, శ్రీకాళహస్తిలోని అమ్మ వృద్ధాశ్రమం, కంచికామకోటి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ అధ్యక్షుడు దుప్పట్లు పంపిణీ చేశారు. సభ్యులు షరీఫ్, నారాయణ, శ్రీనివాసులు, చంద్ర, సురేష్, ప్రదీప్‌కుమార్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు



నారాయణవనంలో అక్షింతలను ఊరేగిస్తున్న రామభక్తులు

నారాయణవనం: అయోధ్య రామజన్మ భూమి క్షేత్ర తీర్థ నుంచి నారాయణవనం చేరుకున్న అక్షింతలు, చిత్రపటాలను మండల కేంద్రంలో ఊరేగించారు. ఉదయం 7 గంటలకు ఇక్కడికి చేరుకున్న అక్షింతలు, చిత్రపటాలను స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపుగా శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు వేంచేపు చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి హాజరైన ఆలయాల నిర్వాహకులకు అక్షింతలు, చిత్రపటాలను అందజేశారు. నిర్వాహకులు మోహన్, నాగరాజు, శివ మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఇంటికీ అక్షింతలను, చిత్రపటాలను అందజేస్తామన్నారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముని ప్రతిష్ఠ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలలో ప్రత్యేక భజనలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించాలని, సాయంత్రం ప్రతి ఇంటి ముందు ఐదు దీపాలను వెలిగించి శ్రీరామ నామస్మరణ చేయాలని వారు కోరారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

రేణిగుంట: చిత్తూరులో నిర్వహించిన ఇంటర్నేషనల్ గోజు-ర్యూ కరాటే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు రేణిగుంట డాక్టర్ బషీర్స్ తపస్య స్కూల్ అధినేత విక్రమ్‌శాలి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు మొత్తం 9 బంగారు, 5 రజత, 5 కాంస్య పతకాలను సాధించినట్లు వివరించారు. విజేతలను స్కూల్ డైరెక్టర్ కె.అనూష అభినందించారు.

వైభవంగా గొబ్బెమ్మ పురవీధి ఉత్సవం



అమ్మవారి ఊరేగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం గొబ్బిదేవత పురవీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అలంకార మండపంలో అమ్మవారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ పురవీధి ఉత్సవం జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

10 హుండీ కానుకల లెక్కింపు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 10వ తేదీన హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఈవో కేఎస్.రామారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకుచెందిన ఆర్.శ్రీనివాసరావు, కొండలరావు కుటుంబ సభ్యులు రూ.లక్ష ఆదివారం విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులను కలసి ఈమేరకు విరాళం అందించారు. దాతలకు అధికారులు స్వామి,అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు సతీష్ మాలిక్, నాగభూషణం, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఆండాల్ నీరాటోత్సవాలు ప్రారంభం





నీరాటోత్సవంలో ఆండాళ్ అమ్మవారు, ఊరేగింపులో ఉభయ దేవేరులతో స్వామివారు

- వేడుకగా ఏకాదశి ఉత్సవం
- తిరువీధుల్లో స్వామి, అమ్మవార్ల విహారం

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఆండాళ్ నీరాటోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆండాళ్ అమ్మవారు, ఏకాదశిని పురస్కరించుకుని సాయంత్రం శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి మాడవీధి ఉత్సవంలో పాల్గొన్నారు. భక్తులు అడుగడుగునా కర్పూ హారతులు సమర్పించారు. వేకువ జామున 4 గంటలకు తిరుప్పావై ప్రవచనాలతో ఆలయాన్ని తెరచి నిత్య పూజా, ధనుర్మాస పూజా కైంకర్యాలను పూర్తి చేశారు. ఆరు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. నీరాటోత్సవాల్లో భాగంగా ఆండాళ్ అమ్మవారు తిరుచ్చి వాహనం అధిష్ఠించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. అర్చకులు శ్రీధరభట్టాచార్య మాట్లాడుతూ ధనుర్మాసంలో గోదాదేవి వైకుంఠనాథుడిని భర్తగా పొందేందుకు వ్రతాన్ని ఆచరించారని, భోగి పండుగకు వారం రోజుల ముందు నుంచి ఆండాళ్ నీరాటోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆదివారం నుంచి ఆరురోజుల పాటు రోజూ సూర్యోదయానికి ముందే ఆండాళ్ అమ్మవారి ఊరేగింపు, చివరి రోజు ఆదివారం స్వామివారితో కలసి అమ్మవారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిస్తారని అన్నారు. అలాగే ఏకాదర్శి సందర్భంగా సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరువీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పించారు. ఆర్జితం అధికారి భరత్, షనాయి, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీతోనే ముదిరాజ్‌ల అభ్యున్నతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట(శ్రీకాళహస్తి): ముదిరాజ్ కులస్తుల అభ్యున్నతి వైఎస్సార్ సీపీలోనే సాధ్యమైందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మహేష్ కల్యాణ సదన్‌లో ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పాండవులు కూడా ముదిరాజులని చరిత్ర చెబుతోందన్నారు. ముదిరాజులు తనకు బంధువులని, తన ఇంటి ఆడబిడ్డను ముదిరాజ్ కులస్తులకే ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి జగనన్న ముదరాజ్ బిడ్డ విడదల రజినిని మంత్రిని చేశారని తెలిపారు. నాడు తెలుగుదేశం హయాంలో ఆమెకు జరిగిన అన్యాయం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ముదిరాజులకు అన్నింటా ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. తొట్టంబేడు భాస్కర్ సతీమణి రమాప్రభకు ఆలయ ట్రస్టుబోర్డు మెంబర్‌గా, రేణిగుంట సుజాతమ్మకు వైస్ ఎంపీపీగా, గంగారి రమేష్‌కు మండల పార్టీ అధ్యక్షుడిగా, కుర్రకాలువ వేణుకు పార్టీ జిల్లా నాయకుడిగా, అలాగే 2010లో ఏర్పేడు పార్టీ మండలాధ్యక్షుడిగా కోటేశ్వరరావు, కృష్ణాపురం సర్పంచ్‌గా ముద్దు రాయల్ ఇలా ఎన్నో పదవులు ముదిరాజ్‌లకు ఇచ్చినట్లు తెలిపారు. ముదిరాజ్‌ల కోరిక మేరకు త్వరలోనే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని పేర్కొన్నారు. గత టీడీపీ హయాంలో ముదిరాజ్‌లకు వెన్నుపోటు పొడవడమే తప్ప పదవులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ధనంజయరెడ్డి, సంఘం శ్రీకాళహస్తి గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు తిమ్మరుసు, నాయకులు ముద్దు రాయల్, గుమ్మడి శేఖర్, దేశయ్య, వెంకటేశ్వర్లు, చిన్ని, సురేంద్ర, పురుషోత్తం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ జగనే సీఎం

- జగన్ కోసం 20న సుదర్శన యాగం, రుద్రాభిషేకం
- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోట : ఎవరెన్ని కుట్రలు చేసినా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం కోటకు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో రెండవసారి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చారన్నారు. రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. చంద్రబాబు మరోసారి నీచరాజకీయాలకు తెరతీస్తున్నారని, పవన్ కల్యాణ్ రూ.500 కోట్లకు అమ్ముడు పోయాడన్నారు. ఒక్క జగన్‌ను ఎదుర్కోలేక బీజేపీ, కాంగ్రెస్‌తో కుమ్మక్కయ్యారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో జగన్ విజయఢంకా మోగించి తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఈ నెల 20న కొడవలూరు మండలం రాజుపాళెంలో శ్రీనారికేళ సహిత రసలింగేశ్వర స్వామి ఆలయంలో లక్ష కొబ్బరి కాయలు, లక్ష రుద్రాక్షలు, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చనతో పాటు మహారుద్రాభిషేకం, సుదర్శన యాగం చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరిచలపతి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, కోటమ్మ ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ నరమాల రమణయ్య, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎంపీటీసీ మొబీన్ తదితరులు పాల్గొన్నారు.

